మీకోసంలో 62 అర్జీలు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికనకు 62 ఫిర్యాదులు అందాయి. కలక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్, జాయింట్ కలక్టర్ డా.ఎం.జె.అభిసేక్ గౌడ, ఐటిడిఎ పి.ఒ. వి.అభిషేఖ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కె.పద్మలత సంయుక్తంగా వివిధ మండలాలు నుండి అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు శుక్రవారం సాయంత్రం 4 గంటలు నుండి కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలక్టరు ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ మండలాలు నుండి వచ్చిన ఉద్యోగుల నుండి 11 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సమస్య పరిష్కారానికి శాఖాధిపతులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉపాధి లేక వలసబాటలో గిరిజనులు

- స్థానికంగా దొరకని ఉపాధి పనులు
- చోద్యం చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- నిర్వీర్యమవుతున్న ఉపాధి పనులు

విశాలాంధ్ర-పాడేరు : మన్య ప్రాంతంలో ఉపాధి పనులు లేక ఆదివాసి గిరిజనులు మైదాన ప్రాంతాలకు వలస తరలిపోతున్నారు. స్థానికంగా ఉపాధి పనులు దొరకక ఎంతోమంది ఆదివాసి గిరిజనులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.స్థానికంగా అవసరమైన కూలి పనులు అందుబాటులో లేక వివిధ మైదాన ప్రాంతాలకు వలసలు తరలిపోతున్నారు. గిరిజన ప్రాంతాల్లో స్థానికంగా ఉపాధి లేక కుటుంబ సమేతంగా వలసలకు పరిమితమవుతున్నారు. ప్రజలకు పనులు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమాడంతో ప్రతి ఏడాది వందల సంఖ్యలో సుదూర ప్రాంతాలకు పరిమితమై కాలం గడుపు తున్నారు. ప్రభుత్వాలు ప్రజాప్రతితులు వైఫల్యం కారణంగానే వలసవాదులుగా పరిమితమవుతున్నారని చెప్పక తప్పదు.వలసవాదుల నిర్మూలనే లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏర్పాటు చేసినప్పటికీ పాలకులు, అధికారుల యంత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గిరిజనులు ఉపాధి కోల్పోతున్నారని పలువురు మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అవసరమైన ప్రతి జాబ్ కార్డు లబ్ధిదారుడికి ఉపాధి పనులు కల్పించాలని నిబంధన ఉన్న పాలకుల తీరు వీటిని భిన్నంగా వ్యవహార శైలి నడుస్తుందని పలువురు మండిపడుతున్నారు. పూట గడవడం కోసం సుదూర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్లి అనారోగ్యాలకు గురై పదులసంఖ్యలో మృత్యువాత పడుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వారి కూలి ప్రదేశాల్లో ఎటువంటి రక్షణ సౌకర్యాలు లేకపోయినా వారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పనులు చేసుకునే పరిస్థితి దాపోరుతుంది. రెక్క ఆడితే కానీ డొక్కానిండని పరిస్థితి ఆదివాసి గిరిజనులు ఎంతోమంది ఉన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అందిస్తున్నామని చెబుతున్న పథకాలు రుణాలు అందని ద్రాక్షల మారిందని పేదవారి పేరుతో పెద్దలకే పరిమితం చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. దశాబ్దాల కాలం గడుస్తున్న నేటికీ ప్రభుత్వ సంక్షేమ పాలాలు నేటికీ నిజమైన లబ్ధిదారులకు చేరని దుస్థితి నెలకొన్న పరిస్థితి నేడు చూస్తున్నాం అభివృద్ధికి నోచుకోని గిరిజన ప్రాంతాల్లో గిరిజన చట్టాలకు అనుగుణంగా ప్రత్యేకమైన ఉపాధి కల్పించే లక్ష్యంగా పరిశ్రమాలు ఏర్పాటు చేస్తే వలస నిర్మూలన సాధ్యపడుతుందని, నిరుద్యోగ యువతీ యువకులకు ఎంతోమందికి ఉపాధి కలుగుతుంది. గిరిజన ప్రాంతాల్లో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తామని శిక్షణలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న ప్రజాప్రతినిధు లుగా ఎంపిక అవుతున్న నాయకులు పూర్తిస్థాయి అవగాహన లోపం కారణంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేసే పరిశ్రమలు వివిధ రకాల సబ్సిడీ రుణాలకు గిరిజన ప్రజలు నోచుకోవటం లేదు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యంగా వ్యవహరిస్తూ ప్రత్యేకమైన పరిశ్రమలు రుణాలు మంజూరు చేసేటట్లయితే అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడి అర్హులందరికీ లబ్ధి చేకూరుతాయి.

ఉపముఖ్యమంత్రి పర్యటనతో గిరిజన గ్రామాలు రూపు రేఖలు మారేనా!

స్వాతంత్రం ఏర్పడ్డ ఇప్పటికి రాష్ట్ర స్థాయి నాయకులు రావడం పై హర్షం వ్యక్తం చేస్తున్న గిరి గ్రామాలు

విశాలాంధ్ర-అనంతగిరి : గిరిజన ప్రాంతమైన అల్లూరి జిల్లా ఏజెన్సీలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన కోసం గిరి గ్రామాల ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఈనెల 21 శనివారం నాడు అనంతగిరి మండలం మారుమూల పంచాయితీ అయిన పినకోట పరిధిలోగల గ్రామాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వస్తున్నారని తెలిసి ఆ ప్రాంత ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి స్థాయి నాయకుడు వస్తున్నారు మా బతుకులు మారుతాయి అనే ఆనందంలో గిరిశిఖర గ్రామ గిరిజనులు ఎదురుచూస్తున్నారు. స్వాతంత్రం ఏర్పడ్డాక ఇంతవరకు ఈ స్థాయి వ్యక్తులు ఎవరు ఈ ప్రాంతాన్ని పర్యటించిన దాఖలాలు ఇప్పటివరకు లేవని గిరిజనుల ఆనందానికి అవధులు లేకుండా ఉన్నాయి. జీనబాడు, పినకోట, పెద్దకోట, కివర్ల పంచాయతీల పరిధిలో 50 కి పైగా గ్రామాలు కలిగిన ఈ మారుమూల ప్రాంతం ఎంతో వెనుకబడి ఉందని చెప్పాలి. ఆయా గ్రామస్తులు ఎంత పోరాడినప్పటికీ వెనుకబాటుతనం అలానే ఉంది. ఇప్పటికీ గుర్రాల మీద రాకపోకలు సాగించడం, డోలిమోతలతో వైద్యం కోసం తరలించడం, వాగులు వంకలు దాటడం వంటివి జరుగుతూనే ఉన్నాయి. ఉన్నతాధికారులు ఈ ప్రాంతాల్లో రహదారులు మంజూరు చేసినప్పటికీ అవి మొక్కుబడి పనులు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా వైద్యం కూడా మొక్కుబడిగా అందుతుందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసిన దాఖలాలు అనేకం ఉన్నాయి. విద్య కూడా అంతంతమాత్రంగానే ఉందని విమర్శలు ఉన్నాయి. ఇలాంటి సమస్యల మధ్య రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటిస్తారని ఉన్నతాధికారులు గడిచిన నాలుగు రోజుల నుంచి ఈ ప్రాంతంలో పర్యటిస్తూ గిరిజనుల కష్టాలు ముందుగా తెలుసుకొని ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పర్యటనతో మా గ్రామాలు అభివృద్ధి జరిగే అవకాశం ఉందని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నాయకులే కావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం అనేక ప్రాంతాలకు రహదారులు మంజూరు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల సక్రమంగా చెల్లించక పోవడం నాణ్యత లోపంతో రహదారు నిర్మాణాలు జరగడం ఇవి మధ్యలోనే నిలిచిపోయి వర్షాలకు కోతలకు గురై మామూలు పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా దేవరాపల్లి నుంచి హుకుంపేట మండలం పరిధి వరకు ఉన్న రహదారి కూడా పూర్తిగా పాడైపోయిన కనీసం ఎవరు పట్టించుకునే దాఖలాలు కనిపించడం లేదు. అదేవిధంగా మండల కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టూరా తిరిగి చేరుకునే పరిస్థితి ఉందని అందుకు బొంగిజా నుంచి తారు రోడ్డు మంజూరు చేస్తే ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఉపముఖ్యమంత్రి పర్యటనతో ఈ రహదారిల తో పాటు గిరిశిఖర గ్రామాల రహదారులు కూడా తారు రోడ్లుగా మారుతాయని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పరిస్థితులపై ఇక్కడ ప్రజలు అనేకమార్లు ఆందోళనలు చేసినప్పటికీ అప్పటికే ఏదో హామీ ఇచ్చి శాంతింప చేయడమే తప్ప ఆచరణలోకి ఏమీ రాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మారుమూల ప్రాంతమైన పినకోట పరిధిలో పర్యటన గిరి గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. మా గిరి గ్రామాల అభివృద్ధి కోరుకుంటున్న ఉప ముఖ్యమంత్రికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని గిరిజనులు తెలుపుతున్నారు.

మండలంలో వీడని వర్షం

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా ముసురు పట్టుకోగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా ఓ మోస్తారు వర్షం కురిసింది. మండలంలోని అరకు వారపు సంతలో వివిధ రకాల అటవీ ఉత్పత్తులు విక్రయించేందుకు వెళ్లిన రైతులు, గిరిజనులు పలు ఇబ్బందులు పడ్డారు. పర్యాటకులతో కిటకిటలాడే ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం శుక్రవారం వర్షం కారణంగా బోసిపోయింది. అరకు వర్షంతో కొచ్చిన గిరిజనులు వర్షం కారణంగా తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు.

కెకె లైన్‌లో జారిపడ్డ బండరాళ్లు, పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

విశాలాంధ్ర-అనంతగిరి : కేకేలైన్ బొర్రా రైల్వే స్టేషన్ సమీపంలోని, శుక్రవారం తెల్లవారు జామున 2.30 గంటలకు 37/34.35 కిలో మీటర్ వద్ద రైల్వే ట్రాక్ పై బండరాళ్లు జారిపడడంతో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది.. రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.. రైల్వే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పనులు చేపట్టారు.

అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-జీకే.విధి : మండలంలోని ఐసిడిఎస్ అంగన్వాడి ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సిడిపిఓ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూడెం కొత్తవీధి మండలంలోని అరటిచెట్ల వీధి, డి.కొత్తూరు,బోర్ర మామిడి, పిల్లిగొంది, ఈతలబంధ, కొత్తపల్లి, తీములగుంట, నూతులు/మాలిగూడ, టంగులగోంది గ్రామాలలోని అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. దరఖాస్తుదారులు ఎస్టీ అభ్యర్థులై ఉండాలని, తేదీ 01-07-2024 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు పూర్తికాని వయసు కలిగి వారు అర్హతలని, దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ నుండి 31 తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు సంబంధిత శిశు సంక్షేమ అభివృద్ధి అధికారికి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో నేరుగా లేదా పోస్టు ద్వారా అందజేయ వచ్చుననీ తెలిపారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి

నాలుగు సంవత్సరాలుగా నిధులు లేక కుంటుపడిన గ్రామాభివృద్ధి

దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి

విశాలాంధ్ర పాడేరు రూరల్ : పంచాయితీ సర్పంచ్ ఎన్నికలు జరిగి నాలుగు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ పంచాయతీలకు నిధులు లేక పంచాయితీ గ్రామాలు అభివృద్ధి చేసుకోలేక పోతున్నామని దారెల గ్రామ పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పంచాయితీ నిధులు పక్కదారి పట్టించడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని నాలుగు సంవత్సరాలుగా పంచాయతీలు అభివృద్ధి చేసుకోలేకపోయామని ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించా లని వారు డిమాండ్ చేశారు. పంచాయితీల్లో కుంటుపడిన సమస్యలపై అనేక మార్లు పంచాయితీ అభివృద్ధికై నిధులు కేటాయించాలని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పంచాయతీలపై దృష్టిసారించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు మద్దతు ధర ఇచ్చే బాధ్యత మాది

రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

విశాలాంధ్ర-అనంతగిరి : కాఫీ రైతులకు అండగా ఉంటామని రాష్ట్ర మాజీ మంత్రి రాష్ట్ర జిసి చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర జిసిసి కార్యాలయం విశాఖపట్నంలో తన కార్యాలయంలో విలేకరులతో రాష్ట్ర జీసస్ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కాఫీ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాఫీ రైతులు దళారుల నుండి మోసపోకుండా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాఫీ రైతుల వద్దకే వెళ్లి కాఫీ కొనాలని గతంలో పాచిపెంట కేజీ రెండు 285 ఉండేదని ప్రస్తుత ధర 320 రూపాయలని చెర్రీ పాత ధర 150 రూపాయలని ప్రస్తుతం నూట డెబ్బై రూపాయలు చెల్లిస్తామని రోబెస్త పాత ధర 80 రూపాయలు అని కొత్త ధర 100 రూపాయలు చెల్లిస్తామని కాఫీ రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతులు దళారుల దగ్గర మోసపోకుండా ఉండాలని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని భవిష్యత్తులో రైతులకు మేలు జరిగే విధంగా కూటమి ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని ఈ ఏడాది 1500 నుండి 2000 మెట్రిక్ టన్నులు కాఫీ కొనుగోలు లక్ష్యంగా పనిచేస్తున్నామని కాఫీ కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా రాష్ట్ర జిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు.

క్రిస్మస్ కోసం అందుబాటులో అమెజాన్ ఫెస్టివ్ స్టోర్

విశాలాంధ్ర-పాడేరు : ఈ క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేకంగా ఇచ్చిపుచ్చుకున్న బహుమతులు, ఇతరత్రా సామాగ్రి, విభిన్న తరహా ఉపకరణాల ఒకే చోటు దొరికేలా ఫెస్టివల్ స్టోర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు అమెజాన్ డాట్ ఇన్ ప్రతినిధి చెప్పారు. వన్-స్టాప్ షాప్ గా ఫెస్టివల్ స్టోర్ డిసెంబర్ 18 నుండి డిసెంబర్ 25 వరకు స్టోర్ ఉంటుందన్నారు. ఈ అమెజాన్ స్టోర్‌లో క్రిస్మస్ అలంకరణ సామాగ్రి, పండుగ ట్రీట్స్, సౌందర్యపరంగా తప్పకుండా కలిగి ఉండవలసిన సామగ్రులు, స్టైలిష్ హ్యాండ్ బ్యాగ్లు, స్మార్ట్ టెక్ యాక్సెసరీలు, క్రిస్మస్ దుస్తులతో సహా వివిధ విభాగాల్లో లక్షలాది ఉత్పత్తులను, ఇంకా మరెన్నో సామాగ్రి ఉన్నయన్నారు. అదనంగా, ప్రజాదరణ పొందిన బ్రాండ్లైన సామ్సంగ్, వన్ప్లస్, డ్యూరాసెల్, ఫాసిల్, జీవ, అమెజాన్ అలెక్సా, ఫారెస్ట్ ఎసెన్షియల్స్, మిల్టన్, లావీ, సుగర్, గ్జియోమీ, అలెన్ సోలీ, ఫరెవర్ 21, ఇంకా మరెన్నో బ్రాండ్లకు చెందిన వివిధ విభాగాలలో విస్తృత శ్రేణి ఉత్పత్తులను బహూకరించేందుకు కస్టమర్లు ప్రత్యేకమైన డీల్స్ మరియు ఆఫర్ల కోసం స్టోర్లో ఇక్కడ వెదకవచ్చునని చెప్పారు.

అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి : సిపిఐ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అనుచితంగా పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణ చెపుతూ వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు.అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి కుల- మతోన్మాదం నశించాలని, అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని, కేంద్ర ప్రభుత్వం ఆయనను అరెస్టు చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బిజెపి మతోన్మాద చర్యలు మితిమీరాయని మండిపడ్డారు. మనుధర్మ శాస్త్రాన్ని తమ రాజ్యాంగంగా మార్చుకొని అమలు చేయాలని బిజెపి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రపంచ దేశాలు మేధావిగా గుర్తించిన బి.ఆర్ అంబేద్కర్ చిరస్మరణీయుడని, యావత్ ప్రపంచ%శీ% భావిస్తోందన్నారు. ఆయన ఆశయాలను, ఆలోచనలను అమలు చేస్తామని అంటూనే ఆయనకు బదులుగా దేవుడి పేరు స్మరించాలని చెప్పడం వెనుక అమిత్ షా అసలు ఉద్దేశం బట్టబయలైందన్నారు. దేశ ప్రజల ఆరాధ్య దైవం అంబేద్కర్ను కించపరిచి దేశ సమస్త ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన చెప్పారు. పార్లమెంట్ లోనే అంబేద్కర్ను అవమానించి నందుకు తక్షణం ఆయనను అరెస్టు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై కేంద్రం స్పందించకపోతే తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను ప్రధాని మోడీ సమర్ధించడం సిగ్గుచేటు అన్నారు. దీంతో దేశ ప్రజలపై బిజెపి చూపిస్తున్న కపటప్రేమ అర్థమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సూరయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అన్నదాతల్లో ఆందోళన

విశాలాంధ్ర -జియ్యమ్మవలస : మండలంలో గురువారం సాయంత్రం నుంచి కురుస్తున్న అకాల వర్షంతో అన్నదాతలలో ఆందోళన నెలకొంది. పంట పొలాలలో వరిచేలు, కల్లాలలో నూర్పిడి చేసిన ధాన్యం తడిసి ముద్దవుతున్నాయని వర్షం ఎక్కువగా కురుస్తుండడంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని చేతికి వచ్చిన పంట తడిసి ముద్దవుతుండడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు.

ఏనుగులతో నిరంతరం నష్టపోవడమేనా... పరిష్కారం చూపేదెప్పుడు?

- నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పాలకొండ : ఏనుగుల చేసిన విధ్వంసానికి నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బి.అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2009వ సంవత్సరంలో ఒరిస్సాలో గల లఖిరేఖల్ అడవి నుండి వచ్చిన ఏనుగుల గుంపు పాలకొండ నియోజక వర్గంలో పంట నష్టాల్ని కలుగజేస్తూ 11 మంది మనుష్యుల ప్రాణాలను బలిగొన్న(హతమార్చిన) ప్రభుత్వాలకు మాత్రం చీమకుట్టినట్టైనలేదు. ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేస్తున్న పాలకులు, అటవి శాఖఅధికారులు తదుపరి వారిచ్చిన హామీని కాలగమనంలో విడిచి పెట్టేస్తున్నారు. నేడు భామిని మండలంలో వంశధార నదీ పరివాహా ప్రాంతంలో గత వారం రోజులుగా తిష్ట వేసిన ఏనుగులు గుంపు వల్ల రైతులు ప్రజలు, పంటలు, గిరిజనులు పొలాల్లోకి వెళ్ళలేని పరిస్థితి అదే సందర్భంలో పొలాల్లో ఉన్న వరి కుప్పలు, నూర్పు చేసిన ధాన్యం రాశులను, ధాన్యం బస్తాలను పత్తి పంటలు, తదితర పంటలను నాశనం చేశాయి. షుగర్ లెస్ ధాన్యం వరికుప్పను వాటి ఇష్టమొచ్చినంతవరకు తిని తదుపరి బస్తాల్లో ఉన్న ధాన్యాన్ని, బస్తాల్లో ఉన్న పత్తిని చేలా చెదురు చేశాయి. భామిని గ్రామానికి చెందిన గురుబిల్లి చలంనాయుడు 50 సెంట్లు భూమిలో వచ్చిన పంటషుగర్ లెస్ ధాన్యం కుప్పను,అదే రైతు చెందిన సుమారు 50 బస్తాల వరకు అయ్యే ధాన్యం రాసిని, మరో రైతు గురుబిల్లి బాలకృష్ణకు చెందిన నాలుగు బస్తాల్లో ఉన్న ధాన్యాన్ని బస్తాలు చించివేసి చెల్లాచెదురు చేశాయి. అదే గ్రామానికి చెందిన గురువిల్లి జోగి నాయుడు రెండు బస్తాల పత్తి పంట నష్టాలను చేసి ఎందుకు పనికి రాకుండా నష్టపెటాయి. కావున పై రైతుల పంట నష్టాన్ని వ్యవసాయ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు తక్షణమే అంచనావేసి రైతులకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. అటు కొమరాడ ఇటు భామిని మండలంలో ఉన్న ఏనుగుల గుంపులను తక్షణమే సురక్షిత ప్రాంతానికి తరలించి రైతులను, ప్రజల, మూగజీవాల ప్రాణాలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.

పవన్‌కళ్యాణ్ పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ స్వీయ పరిశీలన... పర్యటన విజయవంతం

విశాలాంధ్ర-మక్కువ/పార్వతీపురం : పార్వతీపురం జిల్లాలో గిరిశికర గ్రామం బాగుజోలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక,పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హేమలతలు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా యంత్రాంగంను అక్కడే ఉండి పర్యటన విజయవంత మయ్యేలా ప్రత్యేక దృష్టి సారించారు. ఎడతెరిపిలేని వర్షములో కూడా పర్యటన విజయవంతం కావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు లేకుండా చర్యలు

- రూ. 46కోట్లతో గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణం
- గిరిజన ప్రాంతాల్లో రహదారి, తాగునీరు, ఉపాధి కల్పనకు కృషి
- మక్కువ ప్రాంతమంటే నాకు మక్కువ
- ప్రతి రెండు మాసాల్లో 12 రోజులు మన్యంలోనే పర్యటిస్తా
- మహిళా సంఘాలకు రూ. 4కోట్ల 14లక్షల 72 వేల రుణాల పంపిణీ
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-మక్కువ/పార్వతీపురం : గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలకు స్వస్తి పలికేందుకు అన్నిగిరిజనప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ, అటవీ శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు అయినప్పటికీ గర్భిణీలు,బాలింతలు డోలీల్లో వెళ్లడం బాధాకరమని తెలిపారు. మీకోసం పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి దిశా నిర్దేశకత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎక్కువ ప్రజలు నివాసం ఉండే ప్రాంతాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు వివరించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మక్కువ మండలం బాగుజోల నుంచి సీరివర గ్రామం వరకు రూ. 9.5 కోట్లతో 9 కి.మీ తారు రోడ్డుగా మార్చనున్నట్లు చెప్పారు. అలాగే రూ. 46కోట్లతో జిల్లాలో 19 రహదారులను వేయనున్నట్లు తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మక్కువ మండలం దుగ్గేరు పంచాయతీలోని బాగుజోల గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 20.11 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలో చేపట్టనున్న 19 గ్రామాల్లోని బీటీ రోడ్ల నిర్మాణ పనులకు, రూ. 9.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బాగుజోల నుంచి సిరివర గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణ పనులకు ఉప ముఖ్యమంత్రి స్విచ్ ఆన్ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2017లో చేపట్టిన యాత్రలో గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, ఉపాధికల్పన అవసరమని గుర్తించినట్లు చెప్పారు. ప్రకృతి అందాలకు, సహజసిద్ధ జలపాతాలకు మన్యం జిల్లా నెలవని, ఈ ప్రాంతంలో 20కి పైగా జలపాతాలు ఉన్నట్లు గుర్తు చేశారు. పర్యాటకంగా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు. ఏప్రాంతమైన వృద్ధి చెందాలంటే రోడ్లు అవసరమని, కాని గతఐదేళ్లలో జరగలేదన్నారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో నిధులు లేనప్పటికీ రహదారులుకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని, అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించనున్నామని చెప్పారు. మన్యం ప్రజల కోసం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అహర్నిశలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. పాడేరు, అరకు, మన్యంలోని అనేక గిరిజన గ్రామాలను స్వయంగా సందర్శించి, గిరిజనుల సాదకబాధలు తెలుసుకున్నానని అన్నారు. బాగుజోల సిరివర తారురోడ్డు నిర్మాణానికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ఈలోగా గట్టి రోడ్డును తాత్కాలికంగా వేయాలని అధికారులను ఆదేశించారు. మక్కువ ప్రాంతమంటే నాకు మక్కువని, ఇక్కడి సహజ సిద్ధ వాతావరణంలో పెరిగిన మిమ్మల్ని చూస్తే ఆనందంగా ఉందని అన్నారు. గిరిజన యువత నైపుణ్యాలను మరింత పెంపొందించు కోవాలని, ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, గిరిజన పెద్దలతో మాట్లాడి యువతకు ఉపాధి కల్పించేందుకు బలమైన పరిష్కారం చూస్తామని అన్నారు. తాను అధికారంలో ఉన్నా, లేకున్నా గిరిజన ప్రజల కోసం అహర్నిశలు పాటు పడతానని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి జరిగే వరకు స్వయంగా పర్యవేక్షణ చేస్తానని, ఇకపై ప్రతీ రెండు మాసాల్లో 12 రోజులు మన్యంలోనే పర్యటించి 2027లోగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సారథ్యంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని, మీ ప్రాంతాల్లో జరిగే రోడ్లు, పాఠశాలలు, గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్మాణ పనుల్లో నాణ్యతలో లోపం ఉంటే తెలియ జేయాలని గిరిజనులను కోరారు. మీకోసం పనిచేసే మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారని, వారి దృష్టికి లోపాలను తీసుకురావడం ద్వారా మరింత మంచి జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కుల, మత, జాతితో సంబంధం లేకుండా యువత అభివృద్ధి చెందాలనేదే తన తపన అని పేర్కొన్నారు. అనంతరం పనసభద్ర పంచాయతీ పరిధిలోని మహిళా సంఘాలకు రూ.4కోట్ల 14 లక్షల 72 వేల చెక్కును ఉప ముఖ్యమంత్రి పంపిణీ చేశారు.జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రూ. 46కోట్లతో 19 రహదారులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని అన్నారు. బాగిజోల నుంచి సిరివరకు 9 కి.మీ తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, లోకం మాధవి కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. ఈసమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్,సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత్ సురాన,సాలూరు, మక్కువ ఎంపీపీలు గురుగుబెల్లి రాములమ్మ, మర్రి పారమ్మ, మక్కువ జెడ్పీటీసి ఎం.శ్రీనివాస రావు నాయుడు, కొరమ, పనసభద్ర ఎంపీటీసీలు కూనేటి గింద, సామంతుల వెంకటి, సర్పంచులు తాడంగి సుసుమ, సీదరపు గంగమ్మ, కెఆర్ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి. ధర్మ చంద్రారెడ్డి,జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, డ్వామా, డీఆర్డీఏ పీడీలు కె.రామచంద్ర రావు, వై.సత్యం నాయుడు, జిల్లా అటవీ శాఖాధికారి జి.ఎ.పి. ప్రసూన, డిఎఫ్ఓ కె.శ్రీను బాబు, డీఐపీఆర్ఓ ఎల్.రమేష్, డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. ఎం.వినోద్ కుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి ఓ.ప్రభాకర రావు, జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి కె.రాజకుమార్, ఏపీఈపిడీసిఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, ఇతర జిల్లా అధికారులు, గిరిజన గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అడ్వెంచర్ పార్క్‌ను నీతి అయోగ్ బృందం సందర్శన

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కును ఢిల్లీ నుంచి వచ్చిన నీతి అయోగ్ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన సాహస క్రీడలను పరిశీలించారు. పార్కు నిర్వహణ బాగుందని నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవిండ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా 5డి థియేటర్‌ను సందర్శించారు. 5డి సినిమా అనుభవం అద్భుతంగా ఉందన్నారు. వీరితోపాటు నీతిఅయోగ్ యంగ్ ప్రొఫెషనల్ ఇంద్రజిత్ కుమార్, ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసిన జిల్లా ఎస్పీ



విశాలాంధ్ర -మక్కువ/పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లాలోని మక్కువ మండలం పర్యటనకు శుక్రవారం విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.పవన్‌కళ్యాణ్‌కు జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

విశాలాంధ్ర

పేజీ : 2

- అల్లూరి సీతారామరాజు
- పార్వతీపురం మన్యం

శనివారం 21, డిసెంబరు 2024

గిరిజనులు చిత్రాలు, పెయింట్స్‌ను బహూకరించిన కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : గిరిజనులు వేసిన చిత్రాలు పెయింట్స్ తనకు ఎంతో ఇష్టమని, వాటిని ఢిల్లీ వెళ్లిన సమయంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు అందజేసినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. శుక్రవారం బాగుజోల గిరిశిఖర గ్రామంలో జరిగిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ గిరిజనుల పెయింట్స్ బహూకరించారు. కలెక్టర్ అందజేసిన పెయింట్స్ పటాన్ని పవన్ కళ్యాణ్ పట్టుకొని అందరికీ చూపించి తనకు ఎంతో ఇష్టమని తెలియజేశారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవు

మోతుగూడెం సెక్రటరీ గుంపులపల్లి మోహన్

విశాలాంధ్ర-మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం గ్రామపంచాయతీ సెక్రెటరీ గుంపునపల్లి మోహన్ మరియు సర్పంచి ఆకేటి సీత ఆధ్వర్యంలో మోతుగూడెం వ్యాపారస్తులకు తడి చెత్త పొడి చెత్త వేరు చేసి వేసేందుకు ఒక్కొక్కరికి రెండు ప్లాస్టిక్ టబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ మోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెత్తను ప్లాస్టిక్ టబ్ లోనే వెయ్యాలని రోడ్డు మీద చెత్త వేస్తే జరిమానా విధించడం జరుగుతుందని తెలియజేశారు.

కూనవరం- విజయవాడ బస్సును పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-కూనవరం : ముంపు గ్రామాల ప్రజల కోరిక మేరకు కుంట నుంచి కూనవరం మీదుగా భద్రాచలం విజయవాడ కి నడుపుతున్న బస్సును నిలిపివేయడం సరికాదని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కుంట నుంచి కూనవరం మీదుగా బస్సు నడపడం వలన కుంట ప్రయాణికులు ఆ సర్వీసును ఎక్కడం లేదని దానివల్ల ఆదాయం పడిపోయిందని అదే బస్సును రేఖపల్లి నుంచి డైరెక్ట్ గా కూనవరం మీదుగా భద్రాచలం విజయవాడ నడిపితే ఆదాయం బాగుంటుందని అధికారులు అటుగా పునరాలోచించి సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఇదే సర్వీసు మంచి ఆదాయాన్ని తీసుకొచ్చిందని ఆర్టీసీ అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని రేకపల్లి టు విజయవాడ సర్వీస్ ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా తిమోతి పాస్టర్

విశాలాంధ్ర - జి.మాడుగుల : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన అల్లూరి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా జిమాడుగుల చుట్టు మెట్ట గ్రోత్ ఇన్ క్రైస్ట్ మిషన్ పాస్టర్ తిమోతిని ఎంపిక చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పట్ల మరింత నమ్మకం పెంచిన వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని పాస్టర్ తిమోతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మి వైకాపా పార్టీలో తనకు అప్పగించిన బాధ్యతలను నిరంతరం ప్రజలకు అందు బాటులో ఉండి సేవ చేసే అవకాశం కల్పించిన వైకాపా పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్

విశాలాంధ్ర -పాచిపెంట: మారుమూల గ్రామాలలో ఉన్న దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని మండల రెవెన్యూ డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలో గల కర్రి వలస పంచాయతీ బొబ్బిలి వలస గిరిజన గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులలో భాగంగా ఆయన గిరిజనులుద్దేశించి మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను రెవెన్యూ సదస్సులో భాగంగా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు రెవెన్యూ సదస్సుల ద్వారా మీ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు మారుమూల గిరిజన గ్రామంలో గల గిరిజనులు తమ యొక్క భూ సమస్యలను వివరించేందుకు తాసిల్దార్ కార్యాలయానికి రాలేక పోతున్నారని అందుకే ప్రభుత్వం మీ గ్రామాలకే రెవెన్యూ అధికారులు వచ్చి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు తమ భూ సమస్యలను వివరించారు.

20 గ్రామాల్లో పీసా ఎన్నికలు

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలో పిసా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంపీడీవో గీతాంజలి తెలిపారు. చాలా గ్రామాల్లో ఈఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగా ఉపాధ్యక్షుడు, కార్యదర్శిలను ఎన్నుకోవడం జరిగింది. కొన్నిచోట్ల ఎన్నికలు జరిగాయిఅని తెలిపారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర మక్కువ/పార్వతీపురం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు పార్వతీపురం మన్యంజిల్లాలో గిరిశిఖరగ్రామం బాగుజోలలో ఘనస్వాగతం లభించింది. ఆయనకు రాష్ట్ర రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పుష్పగుచ్ఛాన్ని అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం కురుపాం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం, పాలకొండ, నెల్లిమర్ల శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, లోకం మాధవి, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక,సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్, పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పి అంకిత సురాన ఇతర జిల్లా అధికారులు తదితరులు ఉప ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలను అందించి ఘనంగా స్వాగతం పలికారు. తొలుత మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలుకగా, గిరిజన సంప్రదాయ నృత్యమైన ధింసా నృత్యంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని కాసేపు సందడి చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు డ్వామా పిడి రామచంద్రరావు, జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతి నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మంత్రి వినోద్ కుమార్, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి ఓ ప్రభాకర్, జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం ఎన్ రాణి, జీసిసి డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్, జిల్లా గ్రామపంచాయతీ అధికారి కొండలరావు , జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి నగేష్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జోరువానలో సాగిన ఉప ముఖ్యమంత్రి మన్యం జిల్లా పర్యటన

అడుగడుగునా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-మక్కువ/పార్వతీపురం : ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ గిరిజన గ్రామాల్లో పర్యటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిర్ణయించుకున్న తీరును అన్నివర్గాల వారు హర్షించి బేష్ అంటున్నారు. జోరు వానలోనూ పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఉప ముఖ్యమంత్రి పర్యటన సాగింది. గిరిజన గ్రామాల్లో బురదలో, ఆయన కాలినడకన పర్యటిస్తూ అక్కడ స్థితిగతులను స్వయంగా పరిశీలించారు.వానలో ఆయన రాకను, ఆగకుండా కొండేక్కేతీరును చూసిన గిరిజన గ్రామాల్లోని గిరిజనులు, యువత, అభిమానులు, జిల్లా అధికార యంత్రాంగం చూసి ఆశ్చర్యపోయారు. ఇటువంటి సమయాల్లోనే రావడంవలన గిరిజన ప్రజలు పడే ఇబ్బందులు తెలుస్తాయని చెప్పడంతో వారంతా చప్పట్లతో జేజేలు పలికారు. అంతర్గత రహదారులను పరిశీలించి ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. మక్కువ మండలం, కవిరిపల్లిగ్రామం ప్రారంభం నుంచి చివర వరకు నడిచారు. చీపురువలస సమీపంలోని వెంగళరాయసాగర్ వ్యూ పాయింట్ వద్ద ఆగి ప్రకృతి అందాలను తిలకించారు. కొండలు జలపాతాలను స్వయంగా మొబైల్ లో బంధించారు. ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, సిద్దవటంతోపాటు ఇక్కడ అడ్వెంచర్ టూరిజం అభివృద్ధి చేయాలని, ఇందుకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖకు తెలియచేయాలని అధికారులకి సూచించారు. శంబర గ్రామంలో శ్రీపోలమాంబ ఆలయం వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును పరిశీలించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రోడ్డు క్వాలిటీ, నిర్మాణ వ్యయం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త రోడ్డును తన మొబైల్‌లో వీడియో తీసుకున్నారు. ఇదిలా ఉండగా జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్, సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురానల ఆధ్వర్యంలో జిల్లాలోని మొత్తం పోలీస్ యంత్రాంగం రెండు రోజులపాటు ఈప్రాంతంలో మకాంవేసి అడుగడుగునా పోలీసు భద్రతను కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. గతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఉండే ప్రాంతంలో కార్యక్రమం విజయవంతం కావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. గురువారం నుండి శుక్రవారం సాయంత్రం వరకు ఆగకుండా కురుస్తున్న వర్షంలో తడుస్తూ విధులు నిర్వహించిన పోలిస్ అధికారులను, సిబ్బందికి జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డి అభినందించారు. పార్వతీపురం మన్యం జిల్లా చరిత్రలో ఈతరహా పర్యటన ఎప్పుడూ చూడలేదని అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, పత్రిక విలేకరులు, ఉమ్మడిపార్టీ నాయకులు అనుకోవడం గమనార్హం. వర్షాన్ని లెక్కచేయక రెండు గంటలపాటు గిరిశిఖర ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికార యంత్రాంగం ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరచుకోవాలి : ఎంపీపీ కారంలక్ష్మి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రామవరం గ్రామపంచాయతీ పరిధిలోని శబరిరాయి గూడెం, కొప్పల్లి, గ్రామాలలో రెవిన్యూ గ్రామ సభలు శుక్రవారం నిర్వహించారు ముఖ్య అతిథులుగా ఎంపీపీ కారం లక్ష్మి స్థానిక సర్పంచ్,పాల్గొని వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సు లను గిరిజనులు వారి భూమి హక్కుపొందెందుకు అవసరం మేర ఈ గ్రామ సభలో దరఖాస్తులు పెట్టుకొని ఈకార్యక్రమాన్ని సద్విని చేసుకోవాలని, అలాగే ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు పూర్తిస్థాయిలో అవగాహనతో ప్రభుత్వ పథకాలతోపాటు వారి హక్కులను సాధించుకొనుటకు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. రైతు సంఘం కార్యదర్శి వడ్లది రమేష్ మాట్లాడుతూ శబరిరాయి గూడెం, కోప్పల్లి, గ్రామాలకు చెందిన ఎస్సీ, బీసీ, కులాలకు చెందిన రైతులు మండలంలో 100 ఎకరాలు పైనే భూమి సాగులో ఉంటుందని ఈ పేద రైతులు తాతలకాలం నుండి సాగు చేసుకుంటున్నారని. మాకు ఉన్న కొద్దిపాటి సాగు పంట భూములకు సాగు ధ్రువీకరణ మీ భూమిలో వెబ్ ల్యాండ్ యాప్న పొందుపరుచుటకు పోలవరం భూ పరిహారం 2013 భూ సేకరణ అనుసరించి పరిహారం చెల్లించుట కొరకు మేము మాపెద్దల కాలము నుండి కొద్దిపాటి భూమి వ్యవసాయం కూలి పనులతో జీవనము సాగించుకుంటున్నామని సెటిల్మెంట్ అధికారులు కొంత భూమికి హక్కు పత్రములు ఇచ్చి కొంత భూమి అభ్యంతరం పెట్టి డిఐఎస్ చేసి ఉన్నారు 50 సంవత్సరాలు మేము సాగులో ఉన్నామని మా నిర్వాసితులకు మేలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మీ భూమి మీ హక్కు రెవిన్యూ సదస్సులో తహసిల్దార్‌కి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. తహసిల్దార్ సరస్వతి మాట్లాడుతూ మీ భూమి ఎఫ్‌కు ఎక్కించుటకు ప్రయత్నం చేస్తానని పైఅధికారులకు పంపిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన ఆమెని నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో న్యాయస్థానానికి వెళ్తామని అన్నారు. వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి మండల రైతు సంఘం మండల కార్యదర్శి వడ్ల రమేష్ ఆర్‌టిజిఎస్ ద్వారా అనగా రియల్ టైం ప్రభుత్వ సేవా ద్వారా పరిష్కరించాలని కోరుతూ టెస్ట్ రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి నాగరాజు కుకునూరు సుందరయ్య, కుకునూరు మురళి, తార కాంతమ్మ కోట్ల అప్పారావు, ముత్యాల శ్రీనివాసరావు, వీఆర్వో, సర్వేర్, గ్రామపంచాయతీ సెక్రటరీ తాతారావు సచివాలయం సిబ్బంది రెవిన్యూ సిబ్బంది గిరిజన గ్రామ రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-కొమరాడ : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ టి.జగన్మోహనరావు సీజనల్ వ్యాధులపట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలంటూ శుక్రవారం రామభద్రపురం కొమరాడ ప్రాథమిక ఆరోగ్యంద్రాలను కుమ్మరకుంట గ్రామాల్లో ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం అధికారి టీ.జగన్మోహన్రావు మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సీజనల్ వ్యాదులు, జ్వరాలు మండలంలో ఎక్కడైనా నమోదు అవుతున్నాయా,వాటి ప్రభావం ఏమేరకు ఉంటుందని వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒపి, ఐపి, ల్యాబ్, పార్చురిషన్ రికార్డులు తనిఖీ చేసి ఆరోగ్య తనిఖీలు,వైద్య పరీక్షలు వివరాలు, నివేదికల ద్వారా వైద్యసేవలు అందుతున్న తీరును పరిశీలించారు.అక్కడ రోగులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని సిబ్బందికి తాడు సూచనలు చేశారు. కొమరాడ పిహెచ్సీలో అప్పుడే ప్రసవం జరిగిన తల్లి,బిడ్డ ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. డా. జగన్మోహన్ సిబ్బందితో సమీక్షించి గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా తదితర సీజనల్ వ్యాదులు ఎక్కడ నమోదు అయినా ఆరోగ్య పర్యవేక్షకులు,వైద్య సిబ్బంది వెంటనే క్షేత్ర స్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో విరివిగా వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. త్రాగునీరు విషయమై ప్రజలను అప్రమత్తం చేయాలని,కాచి చల్లార్చిన నీటిని తీసుకునేలా అవగాహన కల్పించారు.నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలన్నారు. మారుమూల, గిరిశిఖర గ్రామాల్లో ప్రాథమికంగా అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలన్నారు. అక్కడ గర్భిణీలను ప్రసవ గడువుకు నెల ముందుగానే గర్భిణీ వసతి గృహాల్లో చేర్చాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య సర్వేల తీరుపై ఆరా తీశారు. డా. బిఆర్ అంబేద్కర్ గురుకులం హాస్టల్‌లో విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటూ, వైద్య సేవలు అందజేయడంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు డా. శిరీష,డా. శామ్యూల్, డా.గణేష్ పట్నాయక్, సిహెచ్ఓ బంగారుబాబు, ఎపిడిమిక్ ఈఓ సత్తిబాబు, సూపర్వైజర్స్ శోభ,శారద, నిర్మల, బద్రి నారారాయణ, జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎండయినా, వానైనా పోరాటం ఆగదు

- డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం
- కలెక్టర్ కార్యాలయం వద్ద "వంటా-వార్పు"

విశాలాంధ్ర-బెలగాం : ఎండయినా, వానైనా డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆగదని గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు స్పష్టం చేసారు. ఈమేరకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఎడతెరిపి లేని వర్షంలో సైతం "వంటా -వార్పు" కార్యక్రమం నిర్వహించారు.31వ రోజు దీక్షను కొనసాగించారు. గిరిజన సంక్షేమ సంఘం, ఐద్వా, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, వి.ఇందిరా, కె. భాస్కరావు, డేవిడ్, కొల్లి సాంబమూర్తి, పి. సంగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఓట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన మంత్రి మొండి వైఖరి వీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని అన్నారు. కనీస వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలతో ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్ గురుకులాల్లో, కెజిబివి ఆ శాఖల్లో ఇస్తున్న జీతాలు కూడా ఇక్కడ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినా ఇవ్వకపోతే ఎలా అని అన్నారు. గత 15-16 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. డిఎస్సీ నుండి గిరిజన గురుకుల ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు దివాకర్, రమేష్, వెంకట్, తిరుపతి నాయుడు, మురళి, కామేష్, జ్యోతి, షర్మిల, గున్నమ్మ, సరస్వతి, లక్ష్మి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తుతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటన విజయవంతం

విశాలాంధ్ర, మక్కువ/పార్వతీపురం : పార్వతీపురం జిల్లాలో మారుమూల గిరిశిఖర గ్రామమైన బాగుజోలలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యాటనపై జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఎప్పటికప్పుడు దగ్గరుండి పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు ఆదేశాలు సూచనలు ఇచ్చి పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. అడుగడుగునా సిబ్బందిని ఏర్పాటు చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వారంతా సక్రమంగా విధులు నిర్వహించారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్, సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత్ సురానల ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయంతం కావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

అదే పేరుతో బ్యాంకు కార్యకలాపాలు కొనసాగింపు

"ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు" రీజనల్ మేనేజరు వెల్లడి

విశాలాంధ్ర-బెలగాం : భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్) వారి ఆదేశానుసారం, ఇక "ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు" సేవలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే పరిమితమవ్వనున్నాయని, తెలంగాణ రాష్ట్రంలోని "ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు" శాఖలు "తెలంగాణ గ్రామీణ బ్యాంకు"తో విలీనం చేయబడి తమ కార్యకలాపాలను కొనసాగిస్తాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని "ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు" శాఖలు అదే పేరుతో కార్యకలాపాలను కొనసాగిస్తాయని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పార్వతీపురం రీజినల్ మేనేజర్ కె. అర్జున్ రావు తెలిపారు. ఈ విభజన క్రమంలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా తేదీ 28-12-2024 నుండి 31-12-2024 వరకు అన్ని శాఖలలో బ్యాంకింగ్ సేవలు, అన్ని ఆన్‌లైన్ లావాదేవీలు (మొబైల్ బ్యాంకింగ్, యుపిఐ, ఎటిఎం, ఖాతాదారుల సేవా కేంద్రాలు (సిఎస్పి) మొదలైనవి అందుబాటులో ఉండకపోవచ్చునని కావున అసౌకర్యానికి చింతిస్తున్నామని అర్జున్ రావు తెలిపారు. ఖాతాదారులు మాతో సహకరించి మీ యొక్క అత్యవసర లావాదేవీలను తేదీ 27-12-2024 లోపు పూర్తి చేసుకోవలసినదిగా విజ్ఞప్తి చేశారు. మీ ఖాతా గురించి ఎటువంటి సందేహాలు ఉన్నా, మీ సమీప శాఖను సంప్రదించ వలసినదిగా ఆయన కోరారు.

శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి నేత్ర పరీక్షలు

విశాలాంధ్ర-కురుపాం : జిల్లా కలెక్టర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ చైర్మన్ ఆదేశాలమేరకు జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమంలో బాగంగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో వున్న సచివాలయాల పరిధిలో గ్రామాలలో గత రెండు నెలలుగా నిర్వహించిన నేత్ర వైద్య శిభిరంలలో చేసిన నేత్ర పరీక్షలలో కేటరాక్ట్ (అంతర కుసుమం) టేరిజియం(కొయ్యకండ) వున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా కార్పోరేట్ కంటి ఆసుపత్రులలో శస్త్ర చికిత్సలు విజయ వంతంగా నిర్వహించారు. పదిహేను రోజులతరువాత శుక్రవారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫాలోఅప్ కంటి పరీక్షలు నిర్వహించామని మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు.శస్త్ర చికిత్సలు చేయించు కున్నవారికి నేత్ర పరీక్షలు అనంతరం మందులు పంపిణీ చేసి పలు సూచనలు, జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మాలాంటి పేదలకు కంటి చూపును తెప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకొని అన్ని సదుపాయాలు కల్పిస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర సురేష్, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి షాపులు నిర్మించి అమ్మకాలకు పెడుతున్న గిరిజనేతరులు

రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి గాలికొండ, ఎంపీటీసీ డిమాండ్

విశాలాంధ్ర-జీ.కే.వీధి : ప్రభుత్వ స్థలాలలో గిరిజనేతరులు, ఆక్రమించి షాపులు నిర్మించి అమ్మకాలు జరుపుట, పై రెవిన్యూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని, సిపిఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపిటిసి, ఆంపురంగి బొజ్జిబాబు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా,జికె వీధి మండలం ఆర్ వి నగర్ లో గిరిజనేతరులు గత కొన్ని, సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను ఆక్రమించి కిరాణా, మెడికల్, మరియు ఇతర షాపులు, గిరిజన చట్టాలను, ధిక్కరించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. నిర్మాణాలు చేయడమే తప్పు అని, దీంతో ఆగకుండా షాపులు ద్వారా లక్షలాది రూపాయలు సంపాదించిన గిరిజనేతరులు ఇప్పుడు మరోక ప్రాంతానికి చెందిన గిరిజనేతరుడికి,అమ్మడం, అతను, మరోక గిరిజనేతరుడికి అదనపు, లాభాలకు అమ్మడం, అంటే గిరిజన చట్టాలను మార్కెట్, లో సరుకులు వలె మార్చడం అనుకున్నారా,గిరిజనేతరులనీ దుయ్యబట్టారు. ఇంతవరకు మా చట్టాలు, ధిక్కరించి, అక్రమ నిర్మాణాలు చేసి, వ్యాపారలతో లక్షలాది రూపాయలు సంపాదించిన మీరు మీ ప్రాంతానికి వేళ్ళిపోయెటప్పుడు స్థానిక పంచాయతీకి అప్పుజెప్పి వెళ్ళకుండా, తమ పట్టా భూములాగా, మరోక గిరిజనేతరుడికి అమ్మడానికి, ఎవరు ఇచ్చారు.హక్కు అని ప్రశ్నించారు. .ఒక ప్రక్క గిరిజనులు అక్రమ కట్టడాలను వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తుంటే,ఒక గిరిజనేతరుడు, మరోక గిరిజనేతరుడికి వాళ్ళ పట్టా భూములగా అమ్ముకుని పోవడం పై తక్షణమే రెవిన్యూ అధికారులు, సమగ్రంగా దర్యాప్తు జరిపి, అమ్మిన వారి పై, కొన్న వారిపై, చట్టపరమైన చర్యలు తీసుకొని, అటువంటి, షాపులు, ఇల్లులను, ప్రభుత్వం ఆదినంలో, తీసుకోవాలని కోరారు.

చీడిపాలెం పంచాయతీలో రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర-కొయ్యూరు : మండలంలోని చీడిపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం కొయ్యూరు తహసిల్దార్ ఎస్. ఎల్. వి.ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుండి వచ్చిన 56 వినతి పత్రాలను అధికారులు స్వీకరించారు. వాటిలో మ్యూటేషన్‌లు-29, ఎఫ్ లైన్-13, ఆర్ఓఎఫ్ ఆర్-4, ల్యాండ్ ఎడింగ్ -4 రీప్లేస్మెంట్ అఫ్ పాసుబుక్ -2డి పట్టా-2,ఎల్ టీఆర్-1 వచనట్టు తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల నుండి వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికిగాను, సాధ్యాసాధ్యాలను అన్వేషించ నున్నట్లు ఆయన తెలిపారు. సాధారణ వినతులను సుమారు 45 రోజులలో పరిష్కారమయేటట్టు చర్యలు తీసుకుంటామన్నరు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కుమారస్వామి, రీసర్వే డిటిపి అప్పన్న, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజన్న దొర, మండల సర్వేర్, వీఆర్వో, వి ఎస్ రెవెన్యూ టీం, సర్పంచ్, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైకాపా అల్లూరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా చిందాడ అప్పారావు

విశాలాంధ్ర-చింతపల్లి : వైకాపా అనుబంధ విభాగమైన అల్లూరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా తనను ఎంపిక చేసి పార్టీ పట్ల మరింత నమ్మకం పెంచిన వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అల్లూరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన చిందాడ అప్పారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను అల్లూరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు పార్టీకి విధేయునిగా పనిచేయడమే గాక, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తానని, గ్రామాల్లో వైకాపాను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే అవకాశం కల్పించిన వైకాపా పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాశ విశ్వేశ్వర రాజు, పార్లమెంటు సభ్యురాలు గుమ్మ తనూజ రాణి, ఎస్ టి సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైకాపా ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కొండరెడ్లకు ఇల్లు కట్టేందుకు చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-వై.రామవరం : అల్లూరి జిల్లా వై.రామవరం మండలం లోతట్టు ప్రాంతం బొడ్డగండి పంచాయితీలో నిరుపేద కొండరెడ్డి కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు కట్టుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించారు. పంచాయితీ లో 112 గృహాలు మంజూరయ్యాయని, ఒక్కో ఇంటికి రూ.2లక్షల 39 వేలు ఇస్తుందన్నారు. ఘాట్ రోడ్డులో మెటీరియల్, ఇసుక, ఇటుక రావానాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయితీకి హౌసింగ్ ఇంజనీర్‌సు నియమించాలని, పీవో దత్తత తీసుకుని ఇల్లు కట్టించాలని కోరారు.

గిరిజనుల చట్టాలు, హక్కులపై లోక్‌సభలో ప్రస్తావించడం హర్షణీయం

- పార్లమెంటు సభ్యురాలు తనుజారాణి వ్యాఖ్యలు అభినందనీయం

- ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : గిరిజన చట్టాలు, హక్కులపై లోక్ సభలో అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజారాణి ప్రస్తావించడం హర్షణీయమని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు భూతరాజు బాలయ్య అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పార్లమెంటులో 47 మంది గిరిజన పార్లమెంటు సభ్యులు ఉన్నప్పటికీ అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజారాణి గిరిజనుల చట్టాలు, హక్కులపై ప్రస్తావించిన తీరు ప్రత్యేకమన్నారు. "పాలక పక్షాలు గిరిజనుల కోసం కొత్తగా చట్టాలేమి చేయనక్కర లేదు, గిరిజనులుగా తమకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేస్తుండడం పై పాలక పక్షాల వైఖరిని తప్పుబట్టిన తీరు ఎన్డీయే కూటమి ప్రభుత్వాలకు చెంప పెట్టన్నారు. రాజ్యాంగం కల్పించిన 1/70 చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో పూర్తి సర్వాధికారాలు గిరిజనులకు మాత్రమే చెందుతాయని, అక్కడ ప్రభుత్వం కూడా ప్రైవేట్ సంస్థగానే పరిగణించ బడుతుందని ఆమె గళం వినిపించడం అభినంద నీయమన్నారు. 1/70, పీసా చట్టం ఉనికి కోల్పోయాయనీ, ఆదివాసి నిరుద్యోగ యువతకు ప్రాణ వాయువుతో సమానమైన జీఓ నంబర్ 3 రద్దయిందని దానిని పునరుద్ధ రించాలని లేని పక్షంలో సమాంతర జీవోను తీసుకు వచ్చి గిరిజన బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేయడం హర్షించదగ్గ విషయ మన్నారు. 1/70, పీసా తదితర చట్టాలను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుండడం, దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు అయినా గిరిజనుల చట్టాలు పటిష్టంగా అమలు కాక గిరిజన బ్రతుకులు "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా" తయారైందన్నారు. గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు చేస్తే గిరిజనాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఇందుకోసం గిరిజనులంతా రాజకీయ పార్టీల కతీతంగా ఐకమత్యంతో కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాలు

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో గల బొబ్బిలి వలస పసుకువలస మంచాడవలస గ్రామాల్లో ఆదిమా గిరిజనులకు ఐ.టి.డి.ఎ పి.ఓ ఆదేశాలమేరకు వారి సహకారంతో నీడ్ స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వహణలో నాలుగు అంశాలపైన కళాజాత కార్యక్రమంలో నిర్వహించిందని నేడు సేవ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పి వేణుగోపాలరావు అన్నారు. బాల్య వివాహాల నివారణ ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ వైద్యుల సమక్షంలో జరగాలని శిశు మరణాలు తగ్గాలని ఆయా ప్రాంతాలలో నిర్వహించిన కళాజాత కార్యక్రమం లో గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. సికిల్ సెల్ అనేమియా రక్తహీనత చేతులు పరిశుభ్రత గూర్చి కళా జాతర ద్వారా తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ఈ కార్యక్రమంలో నీడ్ డైరెక్టర్ పి వేణుగోపాలరావు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవాహాలు నివారణ కు అడ్డుకోవాలని, గ్రామాలు పరిశుభ్రతగా ఉండాలని, గిరిజన గిరిశికర గర్భిణీ స్త్రీల సాలూరులో ఏర్పాటుచేసిన వసతి గృహంలో సాలూరులో చేరాలని తెలిపారు. మారుమూల ప్రాంత మైదాన ప్రాంత గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని వాటిని వినియోగించుకోవాలని కోరారు. చేతబడులు పేరుతో నాటు మందుల వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని కోరారు గిరిజనుల ఆరోగ్యం కోసం గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ సబ్ సెంటర్ ఏర్పాటు చేసిందని వాటిని వినియోగించుకొని వైద్యం పొందాలని కోరారు చేతులు పరిశుభ్రతగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల నుండి దూరం కావచ్చునని తెలిపారు. పలు అంశాలు పైన గిరిజనులకు అవగాహన కల్పించడం జరిగిందని డైరెక్టర్ వేణుగోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాబృందం, సభ్యులు బి.కనకరత్న, మహేష్, మోహన్ రావు పాల్గొన్నారు.

అక్రమ గంజాయి నివారణ చర్యలపై అవగాహన

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కొమ్ములవాడు గ్రామంలో సీలేరు ఎస్సై రవీంద్ర శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీరియల్ ఎస్సై మాట్లాడుతూ ఎవరు కూడా అక్రమ గంజాయి రవాణా చేయరాదని, అలా చేసి మీ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని అలా చేసే వారిపై పోలీస్ కేసులు పెడతామని దాంతో వారి కుటుంబ పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతుందని, జైళ్లలో మగ్గాల్సి వస్తుందని ఇప్పటికే ఈ ప్రాంతీయులు చాలామంది జైల్లో ఉన్నారని ఎట్టి పరిస్థితుల్లో అటువంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని ఎస్సై హెచ్చరించారు. వాహనాలు కలిగి ఉన్నవారు పూర్తి పత్రాలు కలిగి ఉండాలని ఆర్ సి బుక్ డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలని అలాగే మద్యం తాగి వాహనాలు నడపరాదని ఆటోలో పరిమితికి మించి జనాలను ఎక్కించరాదని దానివల్ల ప్రమాదాలు జరుగుతాయని వేగంగా వాహనాలు నడపరాదని ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలని మొబైల్స్ వాడేవారు అపరిచితుల యొక్క ఫోన్ కాల్స్ వస్తే ఎట్టి పరిస్థితుల్లో కూడా లిఫ్ట్ చేయరాదని మీ అకౌంట్లో డబ్బులు జమయ్యాయి ఓటిపి చెప్పమని యూనియన్ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ లోగోలతో రకరకాల మెసేజ్లు వస్తాయని, ఎట్టి పరిస్థితిలో అవి క్లిక్ చేయొద్దని ఎవరైనా క్లిక్ చేస్తే వారి అకౌంట్లో ఉన్న డబ్బులు మొత్తం సైబర్ నేరగాళ్లు దోచుకుంటారని తెలిపారు. అలాగే మీ గ్రామాలలో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా ఎవరైనా సంచరించినట్లయితే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారి గ్రామాలలో సమస్యలను ఎస్సైకి విన్నవించుకున్నారు. ఉన్నతాధికారులకు మీ సమస్యలను తెలియజేస్తానని

కాట్రగెడ్డలో ఉచిత కట్టెల పొయ్యిల పంపిణీ

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయితీ కాట్రగెడ్డ గ్రామంలో ఉచిత కట్టెల పొయ్యిలను క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ కంపెనీ ఎండి సాయిబాబా ఆదేశాల మేరకు ఉచితంగా పంపిణీ చేసినట్టు జీకే వీధి మండల కోఆర్డినేటర్ లకే పరమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వంట చేసుకోవడానికి గ్యాస్ పొయ్యిల కన్నా గిరిజనులు ఎక్కువ మంది కట్టెల పొయ్యిలనే ఇంకా వాడుతున్నారని, ఆ పొయ్యి నుండి వచ్చే పొగ వల్ల కళ్ళకు ప్రమాదం ఉందన్నారు. క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ కంపెనీ ద్వారా ఉచితంగా మండలంలో గిరిజనులకు 10 వేల కట్టెల పొయ్యిలను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కట్టెల పొయ్యిల ద్వారా పొగ రాకుండా నిరోధించ వచ్చని అలాగే చిన్న చిన్న కట్టెలతో వంట చేసుకోవచ్చని ఈ పొయ్యిల పనితీరు చాలా బాగుంటుందని ఆయన అన్నారు.కట్టెలు కూడా ఆదా చేయవచ్చని ఆయన తెలిపారు.అడుగు సైజ్ ఎండిన కట్టెలను బెగ్గలను మాత్రమే ఉపయోగించాలని సిరామిక్ ప్లేట్ వేడెక్కిన తర్వాత వంట సులభంగా చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డ్ ఎవరి పేరు మీద ఉంటుందో వారి ఆధార్ కార్డ్ అలాగే కుటుంబంలో ఎవరిదైనా ఒకరిది కుల ధ్రువీకరణ పత్రం ఉండాలని ఎవరి పేరుతో రేషన్ కార్డ్ ఉంటే వారికి ఉచిత కట్టెల పొయ్యి ఉచితంగా అందిస్తున్నామని గిరిజనులు మాత్రమే అర్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శెట్టి.గణపతి బూడి.ఇంద్రావతి దుప్పులవాడ మాజీ సర్పంచ్ చిట్టపులి.గోపాలరావు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర-గంగవరం : రామకృష్ణ మఠం రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో మాతృ శ్రీశ్రీశారదదేవి 173వ జయంతి ఉత్సవం సందర్భంగా పేదలకు, వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు చీరలు పంపిణీ చేసినట్లు కార్యదర్శి పరిజ్ఞాయ నంద జి మహారాజ్ తెలిపారు. నారాయణసేవ పేరిట మారేడు మిల్లి మండలంలోని లోతట్టు గిరిజన గ్రామాలైన కుండాడ, ముంజుమామిడి, మల్లిశాల, పూజారి పాకలు, చెలకపాకలు, వేటుకూరు, కొత్తవలస, పందిరిమామిడికోట, ఇవ్వంపల్లి, ఐ.భీమవరం, గ్రామాలలోని, వృద్దులు, వితంతువులకు, వికలాంగులకు పేదగిరిజన మహిళలకు, 200 చీరలును పంపిణీ చేసినట్ల ఆయన తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ మేనేజర్‌స్వామి రఘువీరానందజీమహారాజ్, స్వామి ప్రజ్ఞానాథసంధజీ మహారాజ్, బి.ఆర్.ఎస్.శ్రీకాంత్, రామకృష్ణ మిషన్ క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, మరియు వాలంటీర్స్, మామిడి నాగిరెడ్డి, కె.సంజీవ్, కె.రామకృష్ణ, రామకృష్ణ మిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లచ్చిగూడెం గ్రామసభ

విశాలాంధ్ర-చింతూరు : మండలంలోని లచ్చిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన లచ్చిగూడెం, వెంకటరామపురం గ్రామములలో రెవెన్యూ సదస్సులు స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్, నిర్వహించారు. ఈ గ్రామ సభకు లచ్చిగూడెం గ్రామ సర్పంచ్, శ్రీమతి ఉయిక సుబ్బమ్మ. రెవిన్యూ సదస్సుల స్పెషల్ ఆఫీసర్ కె.సుజాత తహసీల్దార్ యస్. చిరంజీవి బాబు, ఆర్.ఐ విగ్నేష్ మండల సర్వేయర్ గోవిందరాజు, గ్రామ రెవిన్యూ అధికారులు యమ్.సింగయ్య, మడకం దూలయ్య, సిహెచ్ మోహన్ గ్రామ సర్వేయర్లు టి. జోగయ్య, ఉయిక రవి, ముచ్చిక భద్రయ్య,పాసరెస్టు డిపార్ట్మెంట్ ఎఫ్‌బిఓ యస్.రామయ్య మరియు మెడికల్ డిపార్ట్మెంట్ కిషోర్ కుమార్ ఒప్తలమిక్ ఆఫీసర్, హెచ్ వి. వనజ, ఏఎన్ఎంలు శిరీష్ దేవి, సిబ్బంది గ్రామ సభలుకు హాజరయ్యారు. ఇందులో భూమి సంబంధిత సమస్యల అనగా, ఆన్లైన్ నమోదు కొరకు, పట్టా మార్పుల కొరకు, అసైన్మెంట్ పట్టాలు కొరకు, భూమి సర్వే కొరకు, విస్తీర్ణం తప్పులు, కొత్తగా పాస్ పుస్తకం కొరకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు కొరకు దరఖాస్తులు స్వీకరించారు, రెవిన్యూ దరఖాస్తులు-13, మెడికల్ సంబంధించి 34 మంది చెకప్ చేయించుకున్నారు.

గుంటగన్నెలలో రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మండలంలోని గుంటగన్నెలలో రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలు, మ్యూటేషన్లు, సరిహద్దు సమస్యల పరిష్కరించాలని గిరిజనులు ఆర్జీలు సమర్పించారు. సర్పంచి మోతిలాస్ మాట్లాడ్లాతూ గిరిజనుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు విన్నవించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి చినగెన్ను మాట్లాడుతూ కార్యాలయం చుట్టూ తిరగకుండా సొంత గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించుకొని అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క గిరిజనుడు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కూటమి నాయకులు విశ్వనాధం, కామేష్, హరి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వెంగళరాయ్‌సాగర్ దృశ్యాలను చిత్రీకరించేందుకు వాహనం దిగిన పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర మక్కువ/ పార్వతీపురం : సాలూరు నియోజకవర్గంలోని బాగుజోల గ్రామంకు పర్యటనకి శుక్రవారం నాడు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు సాలూరు, శంబర మీదుగా వయా దుగ్గేరు నుండి మధ్యాహ్నం రెండు గంటల సమయానికి చేరుకున్నారు. అడుగడుగునా ఆయనకు అభిమానులు యువత కేరింతల కొడుతూ ఘనస్వాగతం పలికారు. దారిలో వెంగళరాయ సాగర్ ప్రాంతంలో నడుచుకొంటూ వెళ్ళి తన కెమెరాలో దృశ్యాలను బంధించారు.దీన్ని పరిశీలించిన ఆయన దీనిద్వారా ఎన్ని వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నది ఆరా తీశారు. అనంతరం శంబర గ్రామానికి విచ్చేసిన సమయంలో శంబర పోలమాంబ తల్లిని రోడ్డుపై నుండి ప్రార్థించి గిరిజన ప్రజలకు మంచి జరిగేలా చూడాలని ప్రార్థించినట్లు తెలిపారు.

రెండు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో రెండు గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలు మంజూరయ్యాయని వాటికి సహాయకురాలుగా నియమాకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనంతగిరి సిడిపిఓ సంతోష్ కుమారి తెలిపారు. కొండిబ పంచాయతీ గొందివలస గ్రామానికి ఒకటి, టోకూరు పంచాయతీ బోరిబోరి వలస గ్రామానికి మరొకటి మంజూరు అయిందని తెలిపారు. ఈ రెండు అంగన్వాడి కేంద్రాలకు సహాయకురాలుగా నియామకానికి ఈనెల 20వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని 31లోపు అన్ని పత్రాలతో పాటు దరఖాస్తు చేయాలన్నారు. పీఎం జన్మన్ కింద మంజూరైన ఈ కేంద్రాలకు స్థానిక గిరిజన వివాహిత మహిళ అయి కచ్చితంగా ఉండాలని ఐసిడిఎస్ పివో సంతోషి కుమారి తెలిపారు. అర్హత ఉన్నవారు ఈ రెండు కేంద్రాలకు అనంతగిరి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్న ప్రజలు

విశాలాంధ్ర-చింతపల్లి : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ట్రాఫిక్ సమస్యతో సతమత మవుతుందని ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ కోఫోఖాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్స్ట్రక్టర్ ఎగ్జామినర్ బాకూరు పాండురాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని హనుమాన్ కూడలి (జంక్షన్) నుండి సంత మార్కెట్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు నిలుపు తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. ఈ సమస్యపై స్థానిక పోలీస్ శాఖ దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ సమస్య పై ఇప్పటికే స్థానిక డి.ఎస్.పి గారికి చరవాణి ద్వారా తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

వైకాపాలో శ్రమించినవారికి సముచిత స్థానం : ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి

విశాలాంధ్ర-చింతపల్లి : వైకాపాలో శ్రమించిన వారికి సముచిత స్థానం ఉంటుందని మరోమారు రుజువైందని ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎస్సీ సెల్ అల్లూరి జిల్లా అధ్యక్షునిగా చింతపల్లి ఎస్సీ కాలనీకి చెందిన చిందాడ అప్పారావును నియమించడం హర్షనీయం అన్నారు. శ్రమించిన ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ అన్నారు. పార్టీ అధికారంలో లేకున్నప్పటికీ ప్రజా సమస్యలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు వైకాపా శ్రేణులు ప్రతినిత్యం పాటుపడుతున్నారు అన్నారు. ఇందులో భాగంగానే పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించేందుకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి నాయకుల సూచనల మేరకు పార్టీ అధినేత చిందాడ అప్పారావు సేవలకు గుర్తింపుగా ఆయనను ఎస్సీ సెల్ విభాగానికి జిల్లా అధ్యక్షునిగా నియమించడం సంతోషకరమైన విషయమని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఏజెన్సీలోని ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీలోని ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు కాకుండా ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వ హించాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ అధికారులతో ఫుడ్ సేఫ్టీపై కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడికి అక్కడ కిరాణా షాపులు తనిఖీ చేయాలని అదేవిధంగా రిసార్ట్లు, హోటల్స్, త్రాగునీటి శాంపిల్స్, వంటనూనె ఏజెన్సీలో జరుగు సంతలలో తనిఖీలు నిర్వహించాలని అదేవిధంగా ఫుడ్ పాయిజన్ కాకుండా ఎక్కడికి అక్కడ తగు జాగ్రత్తలు తీసుకొని అదేవిధంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

సకాలంలో వైద్య సేవలందించాలి : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని సంబంధిత వైద్యాధికారులను ఆదే శించారు. శుక్రవారం మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదేవిధంగా రంపచోడవరం కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని కమిషనర్ వారితోపాటు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం ఆకస్మికంగా పర్యటించి పరిశీలించడం జరిగింది.

డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు విజయభారతి

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ఆరు మాసాల ఇంటర్నషిప్ కొరకు శ్రీసిటీ ఇండస్ట్రీస్ కంపెనీ వారు ఈనెల 27న కళాశాలకు రానున్నట్లు కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన తృతీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు విధిగా హాజరై ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్‌లు డాక్టర్ ఎం.శ్రీనివాసపాత్రుడు, డాక్టర్ వి.రమణ, రవీంద్ర నాయక్, జి.జగదీష్‌బాబు, టీ.జగత్‌రాయ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతుల్ని కన్నీళ్లు పెట్టించిన తుఫాను వర్షాలు...

విశాలాంధ్ర-కురుపాం : ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులు కు గత రెండు రోజుల గా కురుస్తున్న తుఫాను వర్షం కంటతడి పెట్టించింది. కొందరు రైతులు యంత్రాలు తో నూర్చుకుని బస్తాలు కు ఎత్తు కుని ,మరికొందరు కోతలు కోసి కుప్పలు వేసిన వరిపంట అకాల వర్షాలతో తడిసి ముద్దయి పోయాయి. కొద్దోగొప్పో పండించిన పంట అమ్ముకుని ఆర్థిక సమస్యలు తీర్చుకోవడానికి, పండుగ అవసరాలకు ఉపయోగ పడుతుందని ఆశపడిన రైతన్నలు కు ప్రకృతి తుఫాను రూపంలో కన్నెర్ర చేయడంతో కన్నీమున్నీరుగా రోదిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ప్రతి గింజ కొనుగోలు చేయాలని, ధాన్యం తడిసి పోకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసినప్పటికీ ఆధికారులు రైతులు పై ఎలాంటి ఉదాసీనత చూపుతారో వేచిచూడాల్సిందే. మిల్లర్ల సాంకేతిక అభ్యంతరాలు, రంగు మారిన ధాన్యానికి తక్కువ ధరలు, అధనపు తరుగు మొదలైన ఆంక్షలు ఏవిధంగా ఉంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు లో అభ్యంతరాలు సడలింపు, అధనపు తరుగు లేకుండా కొనుగోలు కు మార్గదర్శకాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.అలాగే ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలో వాణిజ్య పంటలు పై ఆశక్తి పెరిగి ప్రత్తి పంటలు వేసిన రైతులకు చేతికి అందిన ప్రత్తి పంట కళ్ళు ముందు తుఫాను కారణంగా తడిసి ముద్దవటంతో కన్నీరు పెడుతున్నారు.

గ్రామ వాలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షులుగా కె.రాంబాబు

హర్ష వ్యక్తం చేసిన వైసీపీ పార్టీ శ్రేణులు

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్ఆర్సిపి అనుబంధ సంస్థ గ్రామ వాలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షులను ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్సీపి కేంద్ర కార్యాలయంఈ నెల 19న విడుదల చేసిన నియామకల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా వాలంటర్ విభాగం నుండి జిల్లా అధ్యక్షులుగా నన్ను ఎంపిక చేయడం పట్ల అర్ష వ్యక్తం చేస్తున్నానని కె రాంబాబు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్సీపి అధినేత జగన్మోహన్ రెడ్డికి,రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో పనిచేసే పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

వైకాపా నమ్మకాన్ని వమ్ము చేయను

అల్లూరి జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు శేఖర్

విశాలాంధ్ర-జి.మాడుగుల : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన అల్లూరి జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడిగా ఎంపిక చేసి పార్టీ పట్ల మరింత నమ్మకం పెంచిన వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అల్లూరి జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు గబ్బాడ శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మి వైకాపా పార్టీలో సముచిత స్థానం కల్పించి నందుకు, అంతేకాకుండా గ్రామాలలో నెలకొన్న సమస్యలను వెలికి తీసి కూటమి ప్రభుత్వాన్ని నిలదిస్తానని, గ్రామాలలో వైకాపా పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే అవకాశం కల్పించిన వైకాపా పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు.